
గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీవద్ద..


నాగోలు డివిజన్ సౌత్‌ఎండ్‌పార్కు కాలనీ కమ్యూనిటీహాల్‌లో ..


బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో..


చంపాపేటలో ..

అయోమయం..గందరగోళం

- ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తుల కొరత
- అర్థంకాక తికమకపడుతున్న ప్రజలు
- పలుచోట్ల దరఖాస్తు ఫారాల కొరత
- పరిశీలించిన ఉన్నతాధికారులు.. ప్రారంభించిన కార్పొరేటర్లు


వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీసెంటర్‌లో దరఖాస్తు ఫారాల కోసం వేచివున్న ప్రజలు


హయత్‌నగర్‌లో..

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అక్కడక్కడా గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా 6 గ్యారంటీల అమలుకు ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 11 డివిజన్లలో డివిజన్‌కు 4 కేంద్రాల చొప్పున 44 కేంద్రాలను, ఒక్కొక్క కేంద్రంలో 4 కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు జరుగనున్న ప్రజాపాలన కార్యక్రమంలో ఒక్కొక్క రోజు కొన్ని కాలనీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ప్రజాపాలన కేంద్రాలను ప్రారంభించిన కార్పొరేటర్లు

ప్రజాపాలన కేంద్రాలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ప్రజాపాలన గ్యారంటీల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్లు సూచించారు. 6 గ్యారంటీల పథకాల దరఖాస్తులను జనవరి 6వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో స్వీకరిస్తారని, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది దరఖాస్తులను స్వీకరిస్తారని కార్పొరేటర్లు తెలిపారు. దరఖాస్తుదారులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్లు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

దరఖాస్తుల కొరత

పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల వద్ద దరఖాస్తులు అందుబాటులో లేక ప్రజలు జిరాక్స్ దుకాణాల వైపు పరుగెత్తుతున్నారు. ఇదే అదనుగా జిరాక్స్ దుకాణాదారులు రూ.30 నుంచి రూ.40 దరఖాస్తులను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు కేంద్రాల వద్ద దరఖాస్తుల కొరత తీవ్రంగా ఉండటంతో దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అయోమయంలో దరఖాస్తుదారులు

అర్హులైన ఒక్క కుటుంబం నుంచి 6 గ్యారంటీలకు ఒక్క దరఖాస్తును చేసుకోవాలనే సమాచారం తెలియకుండా దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. అంతేకాకుండ 6 గ్యారంటీలకు ఒకే దరఖాస్తు అనే విషయంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సి ఉంది. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జతచేయాల్సి ఉందని అధికారులు పేర్కొన్నప్పటికి చాలా మంది దరఖాస్తుదారులకు రేషన్‌కార్డు లేని మూలంగా అయోమయానికి గురవుతున్నారు.

ఉన్నతాధికారుల పరిశీలన

జీహెచ్‌ఎంసీ హౌజింగ్ అండ్ లేక్స్ ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అడిషినల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్‌రెడ్డి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్. పంకజలు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించారు. వీరి వెంట ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు ఫారాల కొరత

వనస్థలిపురం: ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెంటర్ల వద్ద గురువారం ప్రజలు బారులు తీరారు. అయితే దరఖాస్తు మాటేమోగానీ దరఖాస్తు ఫారాలు అందజేయడంలో పలు సెంటర్ల వద్ద అధికారులు చేతులెత్తేశారు. వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన సెంటర్ వద్ద ఉదయం 11 గంటలకే ఫాంలు అయిపోయాయని జీహెచ్‌ఎంసీ సిబ్బంది పేర్కొనడంతో దరఖాస్తుదారులు ఖంగుతిన్నారు. ఇదేమని అడిగితే నిర్లక్ష్యమే వారి నుంచి సమాధానమైంది. గట్టిగా అడిగితే మేమే ఇంటికి వచ్చి ఇస్తామని వారు పేర్కొన్నారు. అయితే గురువారం ఒక కాలనీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పిన అధికారులు ఆ కాలనీవాసులకు ఫాంలు అందజేయడంలో విఫలమయ్యారు. పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొనడంతో గత్యంతరం లేక వందలాది మంది జిరాక్స్ సెంటర్ల వద్ద రూ. 20 నుంచి రూ. 50 పెట్టి జిరాక్స్ ఫాంలను కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకోవడం కనిపించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దరఖాస్తు ఫాంల కొరత లేకుండా చూడాలని, సిబ్బంది దరఖాస్తుదారుల పట్ల సున్నితంగా మెలిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

రేషన్‌కార్డు కోసం

రేషన్‌కార్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. 6 గ్యారంటీల పథకానికి కూడా దరఖాస్తు చేసుకున్నా. పథకం అమలుపై అయోమయం నెలకొంది. దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేయటంలో సిబ్బంది విఫలమవుతున్నారు. దరఖాస్తు ఫారం కోసం రెండుసార్లు తిరగాల్సి వచ్చింది. దరఖాస్తు ఫారాలు లేక కొంత మంది వెనుదిరిగారు. దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలి.

(ఎండీ జావెద్– చంద్రపురికాలనీ)


మన్సూరాబాద్ చంద్రపురికాలనీ కమ్యూనిటీహాల్‌లో..


చైతన్యపురిలో..


చంపాపేట మినీ ఫంక్షన్‌హాల్ వద్ద..

ఘనంగా కాంగ్రెస్ పార్టీ అవిర్భావ వేడుకలు


కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మలక్‌పేట: మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జెండాలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, అశ్వక్‌ఖాన్, ధన్వంత్, ధర్మేందర్, చారి, సునీత్‌పత్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సోహేల్ ఆధ్వర్యంలో మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ వై–జంక్షన్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యారంగాన్ని కాపాడాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

మన్సూరాబాద్: నూతన జాతీయ విధానాన్ని రద్దు చేసి విద్యారంగాన్ని కాపాడాలని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు మీసాల స్టాలిన్ డిమాండ్‌చేశారు. దేశ విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరుతూ జనవరి 12 చలో పార్లమెంట్ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఎల్‌బీనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, పసి వయస్సులోనే మతోన్మాద భావజాలాలను చొప్పిస్తూ విద్యను కాషాయీకరణ చేస్తుందని విమర్శించారు. నాయకులు మీసాల శివ, నిర్మల, నవీన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

లింగోజిగూడ: ఆరు గ్యారంటీల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనక్కి వెళ్లేది లేదని, ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటీ అమలు చేస్తామని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసి ప్రజా పరిపాలన కేంద్రాలను గురువారం రాజశేఖర్‌రెడ్డి పరిశీలించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎవ్వరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా ఇంటి వద్దకే పథకాలు వస్తామని తెలిపారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

దరఖాస్తులు బయట కొనవద్దు : డీసీ

లింగోజిగూడ: ప్రజాపాలన దరఖాస్తులను ఎవ్వరూ బయట కొనుగోలు జేయడం కాని, జిరాక్స్‌లు తీసుకోవడం కాని చేయవద్దని ఎల్‌బీనగర్ సర్కిల్ –4 డీసీ దశరథ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజా పాలన కేంద్రాల వద్ద అందరికీ అందుబాటులో దరఖాస్తు ఫారాలు ఉన్నాయని తెలిపారు. సర్కిల్ పరిధిలోని వనస్థలిపురం, హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్‌లలో ప్రజలకు సరిపడా దరఖాస్తు ఫారాలను నేటి నుంచి అందుబాటులో ఉంచుతామని అన్నారు. జిరాక్స్‌లు కొనడం, అధికడబ్బు వెచ్చించి దళారుల వద్ద ఫారాలను కొని మోసపోవద్దని సూచించారు.

ఆధార్ సెంటర్ వద్ద క్యూ

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న అభయ హస్తం గ్యారంటీ పథకాల కోసం ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవడానికి ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. గురువారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో గురువారం మూసారంబాగ్ మెట్రోస్టేషన్‌లో ఉన్న ఆధార్ నమోదు సెంటర్ వద్ద ప్రజలు బారులు తీరారు. రేషన్ కార్డు కోసం, చిన్నపిల్లల పేర్లు నమోదు, చిరునామా, పుట్టిన తేదీ మార్పులు, ఐరీష్ అప్డేట్ చేసుకోవడానికి, గ్యాస్ ఎజెన్సీల దగ్గర కేవైసీలో అప్డేట్‌లో ఇబ్బందులు తలెత్తడంతో బయోమెట్రిక్ అప్డేట్ కోసం ఆధార్ కేంద్రం వద్ద పిల్లలు, పెద్దలు గంటల తరబడి వేచి ఉంటున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌సదన డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి సూచించారు. గురువారం డివిజన్ పరిధిలో అధికారులతో కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ పలువురి నుండి దరఖాస్తులు స్వీకరించి అధికారులకు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పథకాలు అన్నింటికి ఒకటే దరఖాస్తు ఉపయోగించుకోవాలని అన్నారు. దరఖాస్తుల కోసం ఎవరూ ఆందోళన పడవద్దని, అందరికీ అధికారులు దరఖాస్తులు అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించిన అనంతరం తప్పనిసరిగా రశీదును పొందాలని అన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసవం అనంతరం పసికందు మృతి

డాక్టర్ల నిర్లక్ష్యంతోనే అని బంధువుల ఆందోళన

వనస్థలిపురం: ప్రసవం అనంతరం పసికందు మృతిచెందడంతో డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే బాబు మృతిచెందాడంటూ బంధువులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన గురువారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బుగ్గతండాకు చెందిన కాట్రోజ్ సుధాకర్ భార్య సరోజ మూడవ కాన్పు నిమిత్తం బుధవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో చేరింది. కాగా కాన్పు కష్టం కావడంతో సిజేరియన్ చేయమని బంధువులు కోరగా పరవాలేదంటూ డాక్టర్లు నార్మల్ డెలివరీకి ప్రయత్నించారు. కాగా గురువారం సరోజకు ప్రసవం జరిగి బాబు జన్మించగా బాబుకు ఆక్సిజన్ అందడం లేదంటూ వైద్యులు బాబును నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. దీంతో బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. అయితే బాబు మెడకు బొడ్డు పేగులు చుట్టుకోవడం వల్ల కాన్పు కష్టం అయిందని, బాబు పుట్టిన తర్వాత ఆక్సిజన్ అందకపోవడంతో అంబులెన్సులో నీలోఫర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని డా.అనిల్‌కుమార్ తెలిపారు. కాగా బాధితులు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

పలుచోట్ల దరఖాస్తుల కొరత


అక్బర్‌బాగ్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల


గడ్డిఅన్నారం రాజీవ్ కమ్యూనిటీహాల్లో..


మూసారంబాగ్ ఇందిరానగర్‌లో..

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ సెంటర్లు గురువారం ప్రారంభించారు. మూసారంబాగ్ డివిజన్‌లో 4, అక్బర్‌బాగ్ డివిజన్‌లో 4 ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దరఖాస్తు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ప్రజలు దరఖాస్తు ఫారాల కోసం క్యూ కట్టారు. మహిళలకు, సినియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద ఉదయం 100 నుంచి 150 వరకు ఫారాలు ఇవ్వడంతో వచ్చిన వారందరికీ ఫారాలు అందలేదు. దీంతో ఫారాల కోసం గంటల తరబడి వేచి చూశారు. మీ సేవ, జిరాక్స్ సెంటర్లలో దొరుకుతున్నాయని చెప్పడంతో ప్రజలు జిరాక్స్, మీ సేవ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. మీ సేవ, జిరాక్స్ సెంటర్లలో నాలుగు పేజీలు ఉన్న దరఖాస్తు కలర్ రూ. 40లు, బ్లాక్ అండ్ వైట్ రూ. 20లకు విక్రయించారు. అధికారులు మధ్యాహ్నం ఒకొక్క సెంటర్ వద్ద బ్లాక్ అండ్ వైట్ 100–150 దరఖాస్తులు పంపిణీ చేశారు. ఉదయం పూట రద్దీ కన్పించిన తరువాత సెంటర్లు వెలవెలబోయాయి. సెంటర్లలలో అవసరమైన దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిరాక్స్ సెంటర్లకు పరుగులు

సెంటర్లను సందర్శించిన ఎమ్మెల్యే బలాల

నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ సెంటర్లను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సందర్శించారు. అక్కడ ఏర్పాట్లు పరిశీలించారు. ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 21, వంకాయ 45, బెండ 50, పచ్చిమిర్చి45, కాకర 60, బీర 45, క్యాలిఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 58, ఆలు 21, ఉల్లి 27, గోకర 50, దోస 35, సొర 15, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 65, అర్వి 45, మునగ 80, చిలగడదుంప 45, బీట్‌రూట్ 27, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 70. ఈధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

తాను మరణిస్తూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో దినసరి కూలి (మేస్త్రీ). ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరిజిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వాయిళ్లపల్లి గ్రామానికి చెందిన ఎం.నగేష్ (45) దినసరి కూలి (మేస్త్రీ)గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న ఉదయం 7.30గంటల ప్రాంతంలో నగేష్ తన ఇంట్లో ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే నగేష్‌ను ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు కామినేని హాస్పిటల్స్‌లోని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి చికిత్సను అందించారు. చికిత్సకు స్పందన లేకపోవడంతో కామినేని వైద్యులు ఈనెల 27న ఉదయం 8 గంటలకు బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు నగేష్ భార్య అండాలు ఇద్దరు కుమారులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో లివర్, కిడ్నీలు, కార్నియాలను దానం చేసేందుకు నగేష్ కుటుంబసభ్యులు అంగీకరించారు. లివర్, ఒక కిడ్నిని కామినేని హాస్పిటల్స్‌కు, మరో కిడ్నీని నిమ్స్‌కు, కార్నియాలను సరోజిని కంటి దవఖాను అందించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

మలక్‌పేట: డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్ గురువారం శాలివాహననగర్, సలీంనగర్‌లో సీసీ రోడ్ నిర్మాణం, పెద్ద బజార్‌లో బాక్స్‌డ్రైన్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.60.7లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు రాంచందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని అనుపమానగర్‌కాలనీ, అగ్రికల్చర్‌కాలనీ, పిండి నారాయణరెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్, నందనవనంకాలనీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుసేకరణ కార్యక్రమాలను కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మమత, మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయక్, మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో నిర్వహించిన అయ్యప్పస్వామి ఉమ్మడి మహాపడిపూజ మండల పూజా కార్యక్రమాలు బ్రహ్మశ్రీరమణ గురుస్వామి చేతుల మీదుగా కాలనీ అధ్యక్షులు కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరక్టర్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సన్నిదాన గురుస్వామి వెంకటగిరిగౌడ్ పాల్గొన్నారు.

చైతన్యపురిలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుకునూరు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్బావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వికాస్‌నగర్ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యరమల రాంరెడ్డి, కౌశిక్, భాస్కర్, వేణు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్3లో రూ.1.25 కోట్ల తో హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న థీమ్ పార్కు పనులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు ఎకరం స్థలంలో అద్భుతమైన థీమ్‌పార్కు నిర్మించనున్నట్లు తెలిపారు. పార్కులో అద్భుతమైన బుద్ధ విగ్రహం , యోగా చేసుకోవడానికి స్థలం , ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లేపార్కు, వాకింగ్ ట్రాక్, గార్డెన్ నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, రాఘవేందర్‌రావు, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం

లింగోజిగూడ: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం వస్తుందని, నిత్యం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆలోచించేది కాంగ్రెస్ పార్టీనేనని ఆ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 139వ అవిర్బావ దినోత్సవం సందర్భంగా గురువారం ఎల్‌బీనగర్ ఎస్‌బీహెచ్ కాలనీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండాను అవిష్కరించి ఆయన స్వీట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ పటిష్టత కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషి ఎనలేనిది అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్ గుప్తా, జూపల్లి ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో.....

ఎల్‌బీనగర్ వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పార్టీ సినియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని కాంగ్రెస్ జెండాను అవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్య శ్రీరాముల వారి అక్షింతల ఊరేగింపు

మలక్‌పేట: మూసారంబాగ్ శాలివాహననగర్‌లో గురువారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీ రాముల వారి అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

ఎల్‌బీనగర్: జనవరి 12న చేపట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు స్టాలిన్ కోరారు. చలో పార్లమెంట్ పోస్టర్‌ను గురువారం దిల్‌సుఖ్‌నగర్లో అవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శివ, వేణు పాల్గొన్నారు.

మొదటి రోజు 27,754 మంది దరఖాస్తు

ఎల్‌బీనగర్: మొదటి రోజున ఎల్‌బీనగర్‌జోనల్ పరిధిలో సుమారుగా 27,754 మంది ఆరుగ్యారంటీల స్కీం కోసం దరఖాస్తులు తీసుకున్నారు. జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్ల వారిగా వివరాలు ఇలా ఉన్నాయి.....

- కాప్రా సర్కిల్ పరిధిలో 8558 మంది, ఉప్పల్ సర్కిల్ పరిధిలో 7079 మంది, ఎల్‌బీనగర సర్కిల్–3లో 5772 మంది, ఎల్‌బీనగర్ సర్కిల్–4లో 4,268 మంది, ఎల్‌బీనగర్ సర్కిల్–5లో 5047 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇవి కాకుండా ఇతర దరఖాస్తులు కూడ సుమారుగా 3,578 మంది దరఖాస్తులు చేసుకున్నారు.